క్లుప్తంగా

టెంకాయల విక్రయానికి వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖాధికారులు

కోడుమూరు రూరల్: గూడూరులో వెలసిన తిమ్మగురుడు స్వామి తిరునాల ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఈఓ గుర్రెడ్డి ఆలయంలో టెంకాయల విక్రయ హక్కులకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో మొత్తం 12 మంది పాటదారులు పోటీపడగా కుమార్ అనే వ్యక్తి అత్యధికంగా రూ.96 వేలకు హెచ్చుపాడి టెంకాయలు అమ్ముకునే హక్కులను దక్కించుకున్నారు. దేవస్థాన పర్యవేక్షణ అధికారి రమేష్, గ్రామస్తులు రామాంజనేయులు, పొన్నగంటి నాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు తరలించాలి

కల్లూరు: కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్ నగర్‌లో ప్రజలందరికీ ఉపయోగపడే కమ్యూనిటీ హాల్‌లో ఉన్న వార్డు సచివాలయాలను వేరే చోటుకు తరలించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నాయకులు కోరారు. ఈమేరకు ఆయన బుధవారం ముజఫర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉన్న వార్డు సచివాలయాల అడ్మిన్లకు వినతి పత్రమిచ్చారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు రూరల్: గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో శ్రీ అప్పాలరెడ్డి తాత తిరునాల పురస్కరించుకుని బుధవారం రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. మొత్తం 5 జతల ఎద్దులు పోటీ పడగా, కర్నూలు మండలం బి.తాంద్రపాడు యేసురత్నంకు చెందిన ఎద్దులు విజేతగా నిలిచాయి. అలాగే తెలంగాణలోని జోగులాంబ జిల్లా కంచుపాడుకు చెందిన ఆంజనేయరెడ్డి ఎద్దులు 2వ స్థానంలో నిలిచాయి. గట్టు మండలం రాంపురం నల్లపురెడ్డి ఎద్దులు 3వ స్థానం, ఆంజనేయరెడ్డికి చెందిన మరో ఎద్దుల జత 4వ స్థానం, ఇదే గ్రామానికి చెందిన మౌలాలి ఎద్దులు 101 అడుగుల దూరం బండను లాగి 5వ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు దాతల సహకారంతో నగదు బహుమతులను అందజేశారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయం మండపం వద్ద తాలుక అర్బన్ పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దల సమక్షంలో అధికారులు ఈ లెక్కింపు చేపట్టారు. ఇందులో 2 నెలల 15 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ.16,39,379 ఆదాయం వచ్చినట్లు వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారి ఎన్.సీతారామిరెడ్డి, గార్గేయపురం ఏపీజీబీ ఫీల్డ్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, ఆలయ పూజారులు చిన్నయ్య, నారాయణ, యల్లరాజు, బాలు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ



కోడుమూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

కోడుమూరు రూరల్: కోడుమూరులోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను బుధవారం ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో హాస్టల్లో జూనియర్లపై సీనియర్ విద్యార్థి దాడి చేసిన ఘటనపై విద్యార్థులతో మాట్లాడారు. అలాగే హాస్టల్లో మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, నాణ్యత ఎలా ఉంది, వసతులు బాగున్నాయా, పరీక్షలు ఎలా రాస్తున్నారంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎంతమంది సిబ్బంది ఉన్నారు, జూనియర్లపై సీనియర్ విద్యార్థి దాడి చేసిన రోజు విధుల్లో ఎవరు ఉన్నారన్న విషయాలపై హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్ వలితో చర్చించారు.

కోరిన కోర్కెలు తీర్చే కోన వేంకటేశ్వరుడు

- నేడు గరుడ సేవతో స్వామి వారి ఉత్సవాలు ప్రారంభం
- మండలంలోనే పెద్ద ఉత్సవంగా శ్రీవారి తిరునాల
- ఆరు రోజుల పాటు కార్యక్రమాలు

సి బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై పద్మావతి, అలివేలి మంగమ్మ సమేతంగా కొలువైన కోన వేంకటేశ్వరుడు కొలిచిన వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. ఇక్కడి స్వామివారి తిరునాల మండలంలోనే పెద్ద ఉత్సవం కావడంతో చుట్టుపక్కల గ్రామాలతో పాటు, పొరుగు మండలాలకు చెందిన ప్రజలు శ్రీవారి ఉత్సవాలలో పాల్గొనడం ఆనవాయితీ. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10న గరుడసేవతో ప్రారంభమై ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నెల 15వ తేదీ మంగళవారం వృషభాల బండలాగుడు పోటీలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్తలు, నిర్వాహకులు తెలిపారు.

తరలిరానున్న భక్తజనం

స్వామి వారిని కొలిచిన వారికి కొంగు బంగారమే, అన్ని శుభాలే జరుగుతాయి అన్నది భక్తుల ప్రగాఢ నమ్మకం. మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, పోలకల్, కంబదహాల్, సంగాల, ఇనగండ్ల, గ్రామాల వారే గాకుండా కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, గూడూరు గోనెగండ్ల మండలాలకు చెందిన దాదాపు 35 గ్రామాల భక్తులతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో ఆట వస్తువుల, మిఠాయి, వినోద దుకాణాలు వెలిశాయి.

స్వామి వారికి పెరుగుతున్న ఆదరణ

కోన వేంకటేశ్వర స్వామికి ఏటా భక్తుల సంఖ్య, ఆదరణ పెరుగుతూ వస్తుంది. తిరుమల వేంకటేశ్వరుడి తరహాలో కార్యక్రమాలను ఇక్కడ నిర్వహించటం విశేషం. ప్రతి శనివారం శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా దసరా, ఉగాది పర్వదినాల్లో ఉత్సవాలు, ముఖ్యంగా తొలిఏకాదశి, ముక్కోటి ఏకాదశి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక పూజలు, మూడు నెలల శావ పర్వదినాల్లో భక్తులు ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



కోన వేంకటేశ్వర స్వామి వారి నిజరూప దర్శనం, ఆలయంలో అలివేలు, పద్మావతి సమేత శ్రీవారు

కర్నూలు తిరుపతిగా ప్రసిద్ధి

తిరుపతికి వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకోలేని భక్తులు కర్నూలు తిరుపతిగా ప్రసిద్ధి చెందిన క్రిష్ణదొడ్డి కోన వేంకటేశ్వరుడి సన్నిధికి వచ్చి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించటం విశేషం. అంతేకాదు శ్రీవారి సన్నిధిలో ఏడాదిలో దాదాపు వందకు పైగా వివాహ కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే చిన్నారుల కేశఖండన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు.



ప్రత్యేక అలంకరణలో కోనవేంకటేశ్వర స్వామి

ఉత్సవాల వివరాలు

విశ్వావసు నామ సంవత్సరం చైత్ర శుద్ధ త్రయోదశి ఈ నెల 10వ తేదీ గురువారం సాయంత్రం స్వామి వారికి గరుడోత్సవం, 11వ తేదీ శుక్రవారం శ్రీవారి కళ్యాణ మహోత్సవం, రాత్రి 2:06 గంటలకు స్వామి వారి ప్రభోత్సవం ఉంటుంది. 12వ తేదీ శనివారం మహా ఘటాభిషేకం, పంచామృతాలు నిర్వహించి, రథాంగ హోమం, పుర్ణాహుతి, రాత్రి 2 గంటలకు గణపతి పూజ, రాత్రి 3 గంటలకు కుంభం, అనంతరం ఆదివారం 13వ తేదీ తెల్లవారుజామున 3:55 నుంచి 4:55 గంటలకు మహారథోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు ఆదివారం అశ్వ, గజారోహణంతో పారువేట, 14వ తేదీ సోమవారం వసంతోత్సవం అనంతరం చక్ర స్నానం, 15వ తేదీ మంగళవారం పాల పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయి.

అన్నదాన కార్యక్రమం

ఉత్సవాలు జరిగే అన్ని రోజుల్లో ఇతర, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు, ప్రజలకు స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వాహకులు, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

స్వామి వారి చరిత్ర



స్వామివారి రథం

కోన వేంకటేశ్వరుడిని కొండపై ప్రతిష్ఠించడంలో ఒక కథ ప్రచారంలో ఉంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు కోడుమూరు మండలంలోని కొండరాయుని కొండపై ఉన్న వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని దొగింలించి సంచిలో తీసుకెళుతుండగా చీకటి పడటంతో స్థానిక కొండపై విశ్రమించారని, తెల్లవారిన తరువాత తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా బరువు పెరిగి ఎంతకీ రాకపోవటంతో విగ్రహాన్ని అక్కడే వదిలేసి వెళ్లారు. అనంతరం అక్కడికి వచ్చిన గొర్రెల కాపర్లు సంచిలో స్వామిని గుర్తించి స్థానికంగా ప్రతిష్ఠించి గుడిని నిర్మించి పూజలు చేయటం ప్రారంభించారని పురాతన కథ ప్రచారంలో ఉంది.

భక్తిశ్రద్ధలతో కిస్తీలు



ఎద్దుల బండిపై ప్రసాదం తీసుకెళ్తున్న గురువులు

ఓర్వకల్లు: ఓర్వకల్లు గ్రామ శివారులో వెలసిన హజరత్ అల్లబకాష్ మియ్యా వలి ఉరుసు సందర్భంగా బుధవారం భక్తిశ్రద్ధలతో కిస్తీలు నిర్వహించారు. సాయంత్రం గురువుల వారి ఇంటి నుంచి ఎద్దుల బండిపై ప్రసాదాలను దర్గా వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించి పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు దర్గా గురువులు మహబూబ్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కురువ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జీవనోపాధులను మెరుగు పర్చుకోవాలి



జీవనోపాధులపై చర్చిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

కల్లూరు: పొదుపు సంఘాల సభ్యులు జీవనోపాధులను మెరుగు పర్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి సూచించారు. బుధవారం చిన్నటేకూరులో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పొదుపు సంఘాల సభ్యులు వారి జీవనోపాధుల కొరకు ఆర్థికంగా ఎంత అవసరం అనే దానిమీద సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వేను ఎన్యూమారేటర్లు ఏ విధంగా చేస్తున్నారని పొదుపు మహిళలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం పుష్పావతి, డీఆర్‌డీఏ సిబ్బంది, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కల్లూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఎ. నూకరాజు అన్నారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీలో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు అందిస్తున్న సేవలను గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆహారం ఆవశ్యకత, తల్లిబిడ్డల ఆరోగ్యం గురించి వివరించారు. అలాగే పరిసరాల్లో దోమలు, ఈగలు పెరగకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియ, డెంగీ మొదలగు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనందరావు, పర్యవేక్షక సిబ్బంది విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు నాగరాజు, మద్దమ్మ, ఎంపీహెచ్‌ఈఓ స్వర్ణగౌరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతల్లో పోషణ లోపం నివారణ కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పోషణ పక్షం పక్కగా అమలు చేయాలని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. బుధవారం పెద్దటేకూరులో సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషణ లోపాన్ని నివారించడమే లక్ష్యంగా పోషణ పక్షం ఈ నెల 8 నుంచి 22వ వరకు నిర్వహిస్తున్నారన్నారు. గర్భిణుల బరువు లెక్కించడము, పిల్లల ఎదుగుదల, వ్యాధి నిరోధక టీకాలు, తల్లిపాల అవశ్యకత, శిశువుల సంరక్షణకు పాటించవలసిన పరిశుభ్రతపై ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎమ్‌లు అవగాహన కల్పించాలన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియ అధికారి డాక్టర్ నూకరాజు

సమతుల్య ఆహారం తీసుకోవాలి

కల్లూరు: రక్తం తక్కువగా ఉన్నా గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులను పరీక్షించి వారితో మాట్లాడి ఆరోగ్యంపై ఆరా తీశారు. హైరిస్క్ గర్భిణులు, తక్కువ ఎత్తు, అధిక రక్తపోటు, ఐరన్ లోపాలు, ఆలస్యంగా గర్భం దాల్చడం తదితర వివరాలు తెలుసుకొని ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. గర్భిణుల్లో రక్తం తక్కువగా ఉన్న, పెరుగుదల లేకపోయిన నిపుణులైన వైద్యులను సంప్రదించాలన్నారు. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులు, పండ్లు ఎక్కువగా ఆహారంలో తీసుకొనేలా చూడాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు వారానికి ఒక్కసారైనా గర్భిణులతో మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్, ఆనందరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టిక ఆహార పక్షోత్సవాలపై అవగాహన

గడివేముల: పౌష్టికాహార పక్షోత్సవాలు ఈనెల 22 వరకు నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన గడివేములలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం ధరించిన మహిళలు ముఖ్యంగా నాలుగు విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భం దాల్చిన మొదలుకొని పుట్టిన బిడ్డకు రెండేళ్ల వయసు వరకు ఉన్న దశ కీలకమన్నారు. గర్భం దాల్చిన మహిళల బాధ్యత ప్రతి అంగన్వాడీ టీచర్, సిబ్బంది తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



గడివేములలో పక్షోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

సి.బెళగల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ రంగనాథరావు సూచించారు. బుధవారం ఎంపీడీఓ రాణెమ్మ, ఇతర మండల అధికారులతో కలిసి డీడీ వీడియో కాన్ఫరెన్స్ (వీసీ)కి హాజరయ్యారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో గ్రామాలలో జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అధికార యంత్రాంగం రెగ్యులర్‌గా విధులకు హాజరై గ్రామాలను సందర్శించాలని, పల్లెల్లో ప్రజల సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అధికారులు ముందస్తు అనుమతి, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ తాగునీరు, రీసర్వే, గ్రామీణ అభివృద్ధి, ఉపాధిహామీ, హౌసింగ్ తదితర శాఖలలో ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలు, పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న సమస్యలపై చర్చించారు. సమీక్షలో ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, ఎంఈఓ – 2 ఆదాంబాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, ఉపాధిహామీ ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు ఉన్నారు.



సి.బెళగల్‌లో వీసీకి హాజరైన ప్రత్యేకాధికారి రంగనాథరావు

అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయండి

గడివేముల: మండల పరిధిలోని అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయాలని రిజర్వాయర్ పోరాట సమితి సభ్యులు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ సాగునీటి సంపదగా గుర్తింపబడిన కేసీ కెనాల్ స్థిరీకరణ కోసం ఏర్పాటుచేసిన ఏకైక నిర్మాణం అలగనూరు రిజర్వాయర్ అన్నారు. దీని ద్వారా అలగనూరు నుంచి కడప వరకు ఉన్న అనేక గ్రామాలకు తాగునీటికి, కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగపడేలాగా ఈ ప్రాజెక్టును చేపట్టారన్నారు. గత కొన్ని ఏళ్ల కిందట రిజర్వాయర్ కట్ట కుంగిపోవడంతో నీటిని వదలడం లేదన్నారు. దీంతో ప్రాజెక్టు దాదాపుగా ఏడు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉందన్నారు. పశువులు, మనుషులకు తాగడానికి కూడా నీరు లభించని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుని కేసీ కెనాల్ ఆయకట్టు పరిరక్షణపై దృష్టి పెట్టి, అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దేశం నాగేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి రఘుమాధవరెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గడివేముల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోరాట సమితి సభ్యులు

రగ్బీ జిల్లా జట్టుకు శిక్షణ

సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కర్నూలు జిల్లా సీనియర్ రగ్బీ జట్టు సభ్యులకు శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. పీడీ రాఘవేంద్ర క్రీడాకారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. జిల్లా జట్టు సభ్యులకు పాఠశాలలో ఐదు రోజుల పాటు శిక్షణ క్యాంప్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఈనెల 14, 15వ తేదీలలో అనంతపురం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు సభ్యులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. పీఈటీ ప్రభాకర్, జాతీయ స్థాయి క్రీడాకారులు శ్రీకాంత్, అక్బర్‌బాషా తదితరులు ఉన్నారు.



జట్టు సభ్యులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

సివిల్ సప్లై గోదాము తనిఖీ




స్టాకు వివరాలపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ

కోడుమూరు రూరల్: గూడూరులోని సివిల్ సప్లైగోదామును బుధవారం కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములో నిల్వవున్న బియ్యం, చక్కెర, ఐసీడీఎస్‌కు సంబంధించిన సరుకుల వివరాలను పరిశీలించి నమోదు చేసుకున్నారు. అలాగే నెలనెలా రేషన్ దుకాణాల డీలర్లకు సరుకులను సకాలంలో పంపించాలని, తప్పనిసరిగా తూకం వేసిన తర్వాతనే సరుకులను డీలర్లకు చేరవేయాలని ఆర్డీఓ సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. గూడూరు తహసీల్దార్ రామాంజనేయులు, సీఎస్ డీటీ నవీన్‌కుమార్, గోదాము ఇన్‌చార్జ్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని శకునాల, గుమ్మితం తండాలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. మస్టర్లలో అవకతవకలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన 10 వారాల బిల్లులు చెల్లించకపోతే తమ జీవనం ఎలా గడుస్తుందని? ఉపాధి కూలీలు ప్రశ్నించగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే బిల్లులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ మధుశేఖర్, టీఏ శ్రీకాంత్, ఎఫ్ఏ హరినాథ్‌గౌడు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

చెట్టు కొమ్మ విరిగి మహిళకు గాయాలు



గాయాలపాలైన క్రిష్ణవేణి

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం అడ్డవాగు సమీపంలో చింతచెట్టు కొమ్మ విరిగిపడి ఓ మహిళకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది తిరుపాల్, రంగన్న వివరాల మేరకు.. అలమూరు గ్రామానికి చెందిన బోయ క్రిష్ణవేణి చింతచిగురు కోసం తమ్మరాజుపల్లెకు వెళ్లింది. కొమ్మపై చిగురు కొస్తుండగా కొమ్మ విరిగి కింద పడింది. ఈ ఘటనలో క్రిష్ణవేణి తలతో పాటు రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో క్షతగాత్రురాలికి నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు.

వెట్‌ల్యాండ్‌లను గుర్తించి నివేదిక ఇవ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో గుర్తించిన వెట్‌ల్యాండ్‌లపై నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వెట్‌ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వెట్‌ల్యాండ్ రూల్స్ 2017 ప్రకారం జిల్లాలో వెట్ ల్యాండ్ సంరక్షణ, నిర్వహణ కోసం కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలు సహజమైన లేదా కృత్రిమ, శాశ్వతమైన లేదా తాత్కాలిక, స్థిరమైన లేదా ప్రవహించే, తాజా, సముద్ర నీటి ప్రాంతాలతో సహా, తక్కువ అలల లోతు ఆరు మీటర్లు గల నీటి సముదాయాలను వెట్ ల్యాండ్ కింద పరిగణించబడుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న వెట్‌ల్యాండ్ వివరాలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలో 333 వెట్ ల్యాండ్స్ ఉన్నట్లు స్పేస్ అప్లికేషన్ సెంటర్ అట్లాస్ గుర్తించిందని, ఆ మేరకు భూముల సరిహద్దులతో పాటు గ్రౌండ్ ట్రూథింగ్ తదితర వివరాలతో వారంలోపు నివేదిక సమర్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వెట్‌ల్యాండ్ కమిటీ సభ్యులు జేసీ డాక్టర్ బి.నవ్య, డీఎఫ్ఓ శ్యామల, ఇరిగేషన్ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీఏఓ వరలక్ష్మి, డీపీఓ భాస్కర్, అదనపు కమిషనర్ కృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ కిషోర్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారి విజయ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.



గోరుకల్లు రోడ్డుకు సైడ్‌కు వదలుతున్న టిప్పర్లు



గోరుకల్లు రెవెన్యూ స్థలంలో యంత్రాలతో తవ్వుతున్న దృశ్యం

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

మట్టి తవ్వకాలు మండలంలో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. గోరుకల్లు గ్రామంలో సర్వే నంబర్ 621లో 1ఏ, 1బి,13,14 నంబర్లలో మొత్తం 2.88 ఎకరాల రెవెన్యూ భూమి ఉంది. ఈ భూమిలో మొత్తం కొండలు, ఎర్రటి గ్రావెల్, తెల్లటి సుద్ద ఉంది. స్థానిక నాయకులు సహకారంతో ఓ రోడ్డు కాంట్రాక్టర్ ఏకంగా గ్రామంలోనే ఉన్న ఈ రెవెన్యూ కొండకు ఎసరు పెట్టాడు. ఇష్టానుసారంగా భారీ యంత్రాలతో గ్రావెల్ తరలించుకుపోతున్నాడు. దీనిపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు మాత్రం నామమాత్రంగా గ్రామ రెవెన్యూ అధికారికి ఆదేశాలు ఇచ్చారు. ఘటనా స్థలంలో భారీ యంత్రాలు, నాలుగు టిప్పర్లు ఉన్నాయి.రెవెన్యూ అధికారులు స్పందించి వాటిని సీజ్ చేసి మట్టి తవ్వకాలను పూర్తిగా నిలిపివేయాలన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డిని వివరణ కొరగా గోరుకల్లు గ్రామంలో గ్రావెల్ తరలింపుకు సంబదించి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. –పాణ్యం



రోడ్డుకు సైడ్‌కు వదిలిన తెల్లని సుద్ద